

- ఓలేటి శ్రీనివాసభాను

**సెక్షన్ నడి మధ్యలో ఆగిపోయింది గూడ్సు బండి.**
**'కు కు కు కు'- గుడ్డు పెడుతున్న కోడిపెట్టలాగా స్టీమ్ ఇంజన్ డ్రైవర్ డిసౌజా 'నాలుగు షార్ట్ విజిల్స్'ఇచ్చాడు. అలా ఒకసారి కాదు నాలుగైదు సార్లు -'కు కు కు కు.... విజిల్ కోడ్ విన్న గార్డు సుబ్బరాజుకి పరిస్థితి అర్థమైపోయింది. బండి ముందుకు సాగదని తెలిసిపోయింది. దారిలో ప్రమాదం జరిగినా, ఇంజన్ చెడిపోయినా, అడ్డు తగిలినా, ఎలాంటి ప్రతికూల పరిస్థితి ఏర్పడినా- ''ముందుకు వెళ్లలేం భాయ్''అని ఆ విజిల్ కోడ్ ద్వారా బండి చివరున్న గార్డుకి డ్రైవర్ పంపే వర్తమానం అది! ఆ హెచ్చరిక విన్న గార్డు ఆగిన బండిలోంచి రక్షణ సరంజామాతో కిందికి దిగాలి. వెనక వైపు నుంచి మరో బండి దూసుకొచ్చే ప్రమాదం నుంచి తన బండిని కాపాడాలి.**


# విజిల్ కోడ్

కానీ ఆ అర్ధరాత్రి అడవి మధ్యలో... ఆకాశం-భూమీ ఏకమైపోతున్న కుండపోతలో ఎవర్ని ఎవరు కాపాడాలో గార్డు సుబ్బరాజుకి అర్థం కాలేదు. ఎదురుగాలి... ఏటవాలు జల్లు... రాకాసి పిడికిళ్ల నుంచి రాలి పడుతూ అంతలేసి వడగళ్లు! ఇంజన్ హెడ్‌లైట్ మీద ఇటుకలు విసిరినట్లు వడగళ్లు పడ్డాయి. అద్దం భళ్లుమంది. కంట్లో ఇసక కొట్టినట్లు బల్బు మీద చినుకులు దాడి చేశాయి. వేడి బల్బు నిండా బీటలు వ్యాపించాయి. చేజారిన గుడ్డులాగా బల్బు విడిపోయింది. కారు చీకటి... తారును కరిగించి కర్టెన్స్ వేలాడదీసినట్లుంది.

ఆ అడవి మధ్యలో అన్ని దిక్కులూ ఒకేలా ఉన్నాయి. అడవి దున్నలూ, చిరుత పులులూ తెగ తిరుగుతుంటాయి. వర్షం రాత్రి డ్రైవరు పరిస్థితి దయనీయం అనుకుంటే గార్డు దుస్థితి దారుణం. మదపుటేనుగుల గుంపు చివర్లో గాయపడ్డ ముసలి ఏనుగులా ఉంది- బొగ్గు వ్యాగన్ల చివర్లోని బ్రేక్ వ్యాన్ పై కప్పునిండా చిల్లులు... లోనికి దుముకుతోన్న వాన నీళ్లు! గార్డు సుబ్బరాజు బట్టలు తడిసిపోయాయి. తడిసిన బట్టల్లో సుబ్బరాజు నాని ముద్దయి పోయాడు.

ఆ రోజు అతను గొడుగు మరిచిపోయాడు. రెయిన్ కోటు ఇంట్లో తలుపు కొనకు వేలాడుతోంది. దానికిందే గమ్‌బూట్లు వెచ్చగా నిద్ర పోతున్నాయి. ఆ మూడూ లేకుండా డ్యూటీకి బయల్దేరని సుబ్బరాజు ఆ రోజు మూడ్ బాగులేక, ఖాళీ చేతులతో, ఖాళీఖాళీగా ఉన్న మనసుతో బ్రేక్‌వ్యాన్ ఎక్కాడు.

గూడ్సు బండి బయల్దేరినప్పుడే మార్షలింగ్ యార్డులో చినుకులు మొదలయ్యాయి. దారి పొడుగునా ఇలా వచ్చి, అలా పోతూ, బండి అడవి తోవ పట్టగానే ఒక్కసారి విరుచుకు పడ్డాయి. తడిసిన పట్టాల మీద ఇంజన్ చక్రాలు 'స్కిడ్' అవడం మొదలైంది. ఇంజన్ చక్రాలకీ, రైలు పట్టాలకీ మధ్య రాపిడి తగ్గడంతో చక్రాలు గిర్రుమంటున్నా బండి మాత్రం కదలటం లేదు. డ్రైవర్ డిసౌజా ఇంజన్‌లోని 'శాండర్స్'ని ఆన్ చేశాడు. అలా చేయడం వల్ల ఇంజన్‌లోంచి సన్నని గొట్టాల ద్వారా పొడి ఇసక పట్టాల మీద రాలుతూ, తడిసిన పట్టాలకీ చక్రాలకీ మధ్య రాపిడిని పుట్టించి, బండి నడిచేలా చేస్తుంది. కానీ ఆ రోజు 'శాండర్స్' పని చెయ్యలేదు. ఇసక రాలటం లేదు. వర్షాకాలంలో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందన్న ముందు చూపుతో డ్రైవర్ డిసౌజా పొడి ఇసక బస్తాని ఇంజన్‌లో రెడీగా ఉంచేవాడు. ఆ రోజు కూడా ఇసక బస్తా ఉంది. ఇంజన్ దిగే పరిస్థితే లేదు. తెగించి దిగినా, దోసిళ్లలోని ఇసక గాలి వానలో కొట్టుకు పోవడం ఖాయం. మరో అయిదు కిలో మీటర్లు వెళ్తేగానీ స్టేషన్ రాదు. బండి





కదలదని తెలిపోవడంతో 'సేఫ్టీ రూల్స్' ప్రకారం డ్రైవర్ డిసౌజా విజిల్ కోడ్ ద్వారా గార్డుకి పరిస్థితిని వివరించాడు.

'కు కు కు కు'

సుబ్బరాజుకి విషయం అర్థమైనా బండి దిగలేని పరిస్థితి. అంత కన్నా నరకంలోకి దిగడం చాలా సులభం. సుబ్బరాజులో ఏదో నిర్లిప్తత... జీవితంలో చాలా జరిగాయి. జరుగుతున్నాయి. వాటిల్లో ఇదీ ఒకటి. కిందకి దిగకుండా చలికి వణికిపోతూ తడిబట్టలతో కూర్చున్నాడతను.

కాసేపట్లో మబ్బులు చెదిరాయి. వర్షం తగ్గుముఖం పట్టింది. అప్పుడు డ్రైవర్ నుంచి మళ్లీ మరో రకం విజిల్ కోడ్– 'కూ కూ కు కు' రెండు లాంగ్... రెండు షార్ట్ విజిల్స్! గార్డుని ఇంజన్ దగ్గరకు రమ్మని వాటి అర్థం. సుబ్బరాజు బ్రేక్‌వ్యాన్‌లోంచి బయటికి వచ్చాడు. అటూ ఇటూ చూశాడు. టార్చ్ వెలిగించి కిందికి దిగాడు. సగం తోవలో ఫైర్‌మెన్ కనకారావు ఎదురై చావు కబురు చల్లగా చెప్పాడు.

''అబ్బెబ్బే... అదెలా అవుతుంది?''అంటూ సుబ్బరాజు ఇంజన్ దగ్గరకు వెళ్లాడు.

''సుబ్బా... ఇట్స్ ఇంపాజిబుల్ టు ప్రొసీడ్'' అన్నాడు డ్రైవర్ దానికి పరిష్కారం 'డివైడెడ్ వర్కింగ్' అని సలహా కూడా ఇచ్చాడు.

రెండు స్టేషన్‌ల మధ్య ఏదైనా కారణం వల్ల ఆగిపోయిన బండిని మొత్తంగా తీసుకు వెళ్లలేనప్పుడు దానిని విడగొట్టి, రెండు విడతలుగా స్టేషన్‌కి చేర్చడాన్నే 'డివైడెడ్ వర్కింగ్' అంటారు. ఇలా చెయ్యడానికి గార్డు అనుమతి తీసుకోవాలి. నో.... వీల్లేదు'' అన్నాడు గార్డు సుబ్బరాజు.

బండిని రెండు పోర్షన్లు చేసి, ఫస్ట్ పోర్షన్‌ని తీసుకుపోతే సెకెండ్ పోర్షన్‌కి తాను కాపలా కాయాలి.

''వద్దుబాబూ అర్ధరాత్రి అడవి మధ్యలో శవ జాగరం చెయ్యడం నా వల్ల కాదు. ఎటు తిరిగీ వర్షం తగ్గింది. కొంత దూరం ట్రాక్ మీద ఇసక వేద్దాం. దగ్గర స్టేషన్ అయిదు కిలో మీటర్లే కదా– ఎలాగో లాగించేద్దాం''అన్నాడు. డ్రైవర్ డిసౌజా భుజాలెగరేశాడు. ''లెట్స్ ట్రై''అన్నాడు. డ్రైవరూ, గార్డూ, ఇద్దరు ఫైర్‌మెన్లూ సాయం పట్టారు.

పట్టాల మీద కొంత దూరం వరకు దోసిళ్లతో పొడి ఇసక వేశారు. సుబ్బరాజు బ్రేక్‌వ్యాన్‌కి చేరుకొని సిగ్నల్ చూపించాడు. డిసౌజా ఇంజన్ స్టార్ట్ చేస్తూ 'గాడ్'అంటూ ఊపిరి తీసుకున్నాడు. బండి కదిలింది. ''అమ్మయ్య నడి సెక్షన్‌లో శవ జాగరం తప్పింది''బ్రేక్‌వ్యాన్‌లో తేలిక పడ్డాడు సుబ్బరాజు.

బండి వేగాన్ని అందుకుంది. కొంత మేరకు దిగుడు తోవ. బాగానే వెళ్లింది. ఆ తరవాత హఠాత్తుగా పెద్ద కుదుపు. డబ్బాలో ఇనప ముక్కలు వేసి ఆడించినట్లుగా వ్యాగన్ల కప్లింగ్స్ చప్పుడు చేశాయి. వెనక వైపు వ్యాగన్లు 'చెయిన్ రియాక్షన్' వల్ల ఒకదాన్ని మరొకటి ఢీ కొట్టి, పెద్దగా చప్పుడు చేశాయి. ఉన్నట్టుండి వెనక వైపు వ్యాగన్లలో వేగం తగ్గింది. బ్రేకు బ్లాక్స్ కీచుమంటూ చప్పుడు చేశాయి. అవి చక్రాల్ని పట్టేయడంతో బండి దాదాపుగా ఆగిపోయింది. నడి మధ్య కప్లింగ్ విరిగిపోవడంతో రెండు భాగాలుగా విడిపోయింది. మొదటి పోర్షన్ ఇంజన్‌తో పాటు వెళ్లి పోతోంది. సాధారణంగా అయితే మొదటి పోర్షన్ వాక్యూమ్ ప్రభావంతో ఆగిపోవాలి. కానీ సాంకేతిక కారణాల వల్ల వాక్యూం బ్రేక్ పడలేదు. డ్రైవర్ డిసౌజా సైతం ఈ విషయాన్ని గుర్తించలేదు. సుబ్బరాజున్న పోర్షన్‌ని సెక్షన్‌లోనే వదిలేసి, ఫస్ట్ పోర్షన్‌తో ప్రయాణం సాగించాడు.

సుబ్బరాజు భయపడ్డట్లే జరిగింది. బండి పార్టింగ్ అయింది. అడవి నడి మధ్యలో ఉండిపోయాడు. చుట్టూ చీకటి. ఏ పొదలోంచి ఏ క్రూర మృగం దాడి చేస్తుందో తెలీదు. దూరంగా ఎక్కడో అడవి దున్నల అరుపులు వినిపించాయి. అవి మందలుగా సంచరించినప్పుడు మహా భయంకరంగా విరుచుకుపడతాయి. సుబ్బరాజు టార్చ్‌వేసి చూశాడు. టెలిగ్రాఫ్ స్తంభం మీద కిలో మీటర్ సంఖ్యను చూడగానే అతనికి గుండె గుభేల్మంది. అంత చలిలోనూ చెమటలు పట్టేశాయి. ఆ కిలోమీటర్ దగ్గరే అడవి దున్నలు నైట్ పెట్రోలింగ్ చేస్తున్న గ్యాంగ్‌మెన్ మీద దాడి చేసి చంపాయి. ఓ చిరుత పులి గుట్టమీంచి గూడ్స్ బండి మీదకి దూకి బ్రేక్ వ్యాన్‌లోని గార్డును పొట్టన పెట్టుకుంది. సుబ్బరాజుకి అవన్నీ గుర్తుకు వచ్చాయి. బ్రేక్ వ్యాన్‌లోకి దూరి, ఇనప తలుపును మూసి దానికి అడ్డంగా తన గార్డుబాక్స్‌ని జరిపాడు. డ్రైవర్ డిసౌజా చెప్పినట్లే బండిని రెండు పోర్షన్లుగా విడగొట్టి వంతుల వారీగా దగ్గరున్న స్టేషన్‌కి చేర్చి ఉంటే ఇలా బలవంతంగా ముక్కలయే పరిస్థితి తప్పి ఉండేది. ఆ భయంకర అనుభవం సుబ్బరాజుకి రెండు రోజుల క్రితం జరిగిన తన జీవితానుభవాన్ని గుర్తుచేసింది.

ఆ రోజు సుబ్బరాజు సెకెండ్ షో నుంచి ఇంటికొస్తూ తోవలో బార్‌కి వెళ్లాడు. అక్కడో రెండు గంటలు గడిపి తెల్లవార గట్ల నాలుగ్గంటలకి ఇంటికి వెళ్లి తలుపు కొట్టబోయాడు... తాళం కప్ప కనిపించింది. దానికో చీటీ ఉంది. అగ్గిపుల్ల వెలుతురులో చీటీ చదివాడు సుబ్బరాజు.

''ఎన్ని సార్లు చెప్పినా నీ ప్రవర్తన మార్చుకోలేదు. గొడవ పడకుండా విడిపోదాం అని బతిమాలుకున్నా నా మాట వినలేదు. ఎక్కడికి వెళ్తున్నానో... ఎవరితో వెళ్తున్నానో నీకనవసరం. ముక్కలైపోయిన కాపురంలో నా బతుకు ముక్కని తీసుకొని నేను వెళ్లిపోతున్నాను. అడవిలాంటి ఈ కొంపలో నీ చావేదో నువ్వు చావు''

అది సుబ్బరాజు భార్య కనకవల్లి రాసిన ఉత్తరం.... అడవి మధ్యలో... రెండుగా విడిపోయిన బండిలోని రెండో వాటాలో, ఒంటరిగా మిగిలిపోయిన గార్డు సుబ్బరాజుకి జీవితంలోని ఒంటరితనం గుర్తొచ్చి మరింత భయం వేసింది.

అర్ధరాత్రి గుండెలదిరిపోయేలా అడవి దున్నల అరుపులు దగ్గర పడుతున్నాయి.

బ్రేక్‌వ్యాన్‌ను ఆనుకుని ఉన్న బొగ్గు వ్యాగన్ మీద ఎవరో... ఏదో దూకిన చప్పుడు. చిరుత పులా?.... ఏమో!

*



## యోగా చేయను!

పెళ్లి తర్వాత సినిమాలు చాలించి రిటైరయిన తారలందరూ రూపం మారిపోయి పీపాల్లా తయారవడం కద్దు. కానీ ఐదేళ్ళ క్రితం సినిమాలు చాలించి గృహిణిగా జీవితాన్ని ప్రారంభించిన కరిష్మా కపూర్ మాత్రం ఇంకా అదే సౌందర్యంతో మెరిసిపోతూ అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ఇటీవల ''నచ్ బలియే–4'' అనే డాన్సింగ్ రియాల్టీ షోలో పాల్గొనడానికి వచ్చిన ఆమెను చూసి ఈమె కరీనా కపూర్ అక్కా లేక చెల్లెలా? అని అనుమానపడ్డారట ప్రేక్షకులు. అయితే తన చెక్కు చెదరని శరీర సౌష్టవానికి వ్యాయామం, యోగా ఇవేమీ కారణం కాదంటోంది కరిష్మా. ''నాకు నా కూతురి వెనక పరిగెట్టడమే పెద్ద వ్యాయామం. దాంతోనే నాకు రోజంతా సరిపోతోంది. యోగా చేయడానికి నాకు సమయం లేదు,'' అంటోంది. మరి ఆమె చెల్లెలు కరీనా వల్ల ఈ మధ్యన మొదలైన 'జీరో సైజ్' నడుము ట్రెండ్ గురించి ఆమె ఏమంటుంది. ''కరీనా, నేనూ ఇద్దరికీ శరీర సౌష్టవం పట్ల శ్రద్ధ అధికమే. కానీ 'సైజ్ జీరో' లాంటిదేమీ లేదు. కరీనా తనకి ఇష్ట మొచ్చింది తినేస్తుంది. కడుపు మాడ్చుకోదు. దానితో పాటు యోగా చేయడమే ఆమె అంత సన్నగా ఉండటానికి కారణం,'' అంటూ తన చెల్లెల్ని సమర్థిస్తోంది.